క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

యలమంచిలి : విద్యుత్ మరమ్మతుల కారణంగా యలమంచిలి పట్టణంలో యలమంచిలి మెయిన్ రోడ్డు , భవనం వీధి, కోర్టు పేట, ఎంపీడీవో ఆఫీస్ వీధి, గాంధీనగరం, ద్వారకానగర్, రామ్మూర్తినగర్, ఓల్డ్ బ్యాంక్ కాలనీల్లో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఎక్జిక్యూటివ్ ఇంజినీరు రమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతరాయాన్ని వినియోగదారులు గమినించాలన్నారు.

మండల అభివృద్ధిపై దృష్టి సారించాలి



హౌసింగ్ సిబ్బందిని ప్రగతి అడిగి తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి మంజులవాణి

మునగపాక : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.మంజులవాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ప్రధానంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. తహసీల్దార్ బాబ్జీ, ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు. కాగా శనివారం సాయంత్రం ప్రత్యేకాధికారి మునగపాకలోని జగనన్న లే-అవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు.

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మునగపాక : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు కోరారు. శనివారం ఆయన మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోనపల్లి రామ్మోహనరావు పాత పద్ధతి ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లర్ల వద్దకు వెళ్లే పద్ధతి ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ అధి కారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు.

ఘనంగా కొత్తమ్మతల్లి తీర్థం

రాంబిల్లి : పెదకలవలాపల్లిలో కొత్తమ్మతల్లి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. చిడతలు, తప్పెటగుళ్ల కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నాడు - నేడు మొదటి విడత పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్రంలో పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా పాలన సాగుతుందని, రాష్ట్రంలో జగన్ యుగం, జగన్ శకం నడుస్తుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల రాజానగరం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజానగరం గ్రామంలోను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రసంగించారు. నవరత్నాలు అమల్లో భాగంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఆపదలో వున్నవారిని ఆదుకోవడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధికి ఎంతో ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఏమీ చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు పింఛను పొందేందుకు వయస్సు తగ్గింపు, డీజిల్ సరఫరాలో రాయితీలు కల్పించడంతో పాటు, ప్రమాదంలో మరణించిన వారికి ఇచ్చే నష్టపరిహారం పెంచడం జరిగిందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే మత్స్యకారులు ఆరికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం గట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గ్రామంలో 4 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. రూ.3 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. నాడు-నేడు రెండవ విడతలో రూ. 21 లక్షలతో అభివృద్ధి చేసే ఎంపీపీ పాఠశాల పనులకు శంకుస్థాపన చేశారు. నాడు - నేడు పథకం ద్వారా రూ. 47 లక్షల మొదటి విడత నిధులతో అభివృద్ధి చేసిన జెడ్పీహెచ్ పాఠశాలను ప్రారంభించారు. అదే విధంగా కోటి 6 లక్షల రూపాయలతో అభివృద్ధి చేసే జెడ్పీహెచ్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్న పథకాలను సభలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్ చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, లీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి కళ్యాణి లక్ష్మణ్, పాయకరావుపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌లు గారా ఉషశ్రీ ప్రసాద్, జగతా భవానీ శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పక్కుర్తి లోవ, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొంకిపూడి రామకృష్ణ, మండల తహసీల్దార్ కె.జయప్రకాష్, సర్పంచ్ మేడిశెట్టి రామగోవిందు, ఎంపీటీసీలు కె.సతీష్‌రాజు, కె.నరేష్, బీసీ సెల్ సీనియర్ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, యజ్జల సత్యనారాయణ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఎమ్మెల్యే సాయం



స్థానికులతో మమేకం అవుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రభుత్వ పథకాలు అందకుంటే నేరుగా తమను సంప్రదించాలని, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ఎరకన్నపాలెం, తట్టవానిపాలెం, జంగలూరు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వారి సమస్యల గురించి ఆరా తీశారు. మూడేళ్లుగా అన్ని వర్గాలకు, అన్ని పార్టీలకు అర్హతను బట్టి సంక్షేమ పథకాలను అందజేశామన్నారు. ఎటువంటి సిఫారసులు, ఎటువంటి వివక్షకు ఈ ప్రభుత్వంలో చోటు లేదన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వచ్చి పథకాల లబ్ధిపై అరా తీస్తూ, సేవ చేస్తున్నారని, సచివాలయ సిబ్బంది నిరంతరం ప్రజల సేవపైనే దృష్టి సారిస్తున్నారని తెలిపారు. కాగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తట్టవానిపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే కన్నబాబు రాజు తన మానవత్వాన్ని చాటుకున్నారు. తట్టవానిపాలెంలో తట్ట సూకరాజు అనే కిడ్నీ బాధితుడ్ని పరామర్శించి, చికిత్స నిమిత్తం పది వేల రూపాయల నగదు అందజేశారు. జెడ్పీటీసీ లాలం రాంబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు నవోదయ నమూనా పరీక్ష

మునగపాక : మునగపాకలో గౌతమ పఠన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి నవోదయ నమూనా పరీక్ష జరుగుతుందని మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. సంతబయిల వినాయక కల్యాణమండపం వద్ద జరిగే పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి వంతున బహుమతులు అందజేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

23న వలంటీర్ల ఇంటర్వ్యూలు

కోటవురట్ల : వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని కైలాసపట్నం, పి.కె.పల్లి, సుంకపూరు గ్రామాలలో వలంటీరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 22న దరఖాస్తుల పరిశీలన, 23న ఇంటర్వ్యూలు, 24న ఎంపికైన అభ్యర్థుల ప్రకటన, 25న విధుల్లో చేరిక ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోషకాహారం పంపిణీ

కోటవురట్ల : కె.వెంకటాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషకాహార పంపిణీ నిర్వహించారు. లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చిక్కీలు అందజేసి పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. ఇంట్లో లభించే కూరగాయలు, పప్పు దినుసులతో పోషకాహారం తయారు చేసుకోవచ్చని వివరించారు. పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యపు అలవాట్లు అలవరుచుకోవాలన్నారు.

వల్లభేశ్వరునికి ఘనంగా పూజలు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీ వల్లభేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గడిచిన రాత్రి భారీ తీర్థ మహోత్సవం అనంతరం తీరాన్ని ఆనుకుని కొండపై వేంచేసి యున్న శ్రీ వల్లభేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కొందరు మత్స్యకారులు ఎర్రజెండాను స్వామి గుడివద్దకు తీసుకువచ్చి మొక్కుగా సమర్పించుకున్నారు.

ఎకరాకు రూ.45 లక్షలు ఇస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ అనిత

నక్కపల్లి : ప్రజా ప్రయోజనాలు, కంపెనీల కోసం రోడ్డు నిర్మించేందుకు భూములు సేకరిస్తున్నామని నష్టపరిహారం విషయంలో మొండి పట్టుదల ఉండకూడదని రైతులంతా సహకరించాలని ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత కోరారు. శనివారం పాటిమీద గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి కాగిత నుంచి రోడ్డు నిర్మించేందుకు భూములు సేకరిస్తున్నామన్నారు. పాటిమీద గ్రామంలో సుమారు 10 ఎకరాల జిరాయితీ భూములు అవసరమవుతున్నాయన్నారు. రైతులు పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ధర ఎకరాకు రూ.45 లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. భూములు ఇవ్వాలని కోరారు. దీంతో రైతులు మాట్లాడుతూ ఎకరాకు రూ.60 లక్షలు చెల్లించాలని కోరారు. కాగిత రైతులకు చెల్లించిన విధంగా తమకు కూడా ఇవ్వాలని కోరారు. వారి భూములు జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయని బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధర పలికే అవకాశం ఉన్నందున ఆ విధంగా చెల్లించడానికి వీలు పడదన్నారు. వారం రోజుల్లో ఆలోచించుకుని ఏ విషయం చెప్పాలని, రైతులు కూడా భూములు ఇచ్చేందుకు సహకరించాలన్నారు. భూసేకరణ ఖచ్చితంగా చేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన వారికి నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ చేస్తామని, ఇవ్వని వారికి కోర్టులో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి, కాపు కార్పోరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, రైతుల తరపున గబ్బర్ సింగ్, రోకళ్ల శ్రీను పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రావాలి

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రోత్సాహం ఇస్తోందని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. టి.జగ్గంపేట, కై లాసపట్నం గ్రామాలలో పర్యటించి వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లను పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకునేవారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే నిర్మాణాలు మొదలు పెట్టాలని సూచించారు. ఇళ్లు నిర్మించుకునేవారికి పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. బిల్లులు వెనువెంటనే మంజూరవుతున్నాయని, మెటీరియల్ కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని తెలిపారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు జానకమ్మ, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, మండల ఏఈ జగదీశ్వరరావు, సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాంటీన్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

యలమంచిలి : యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన క్యాంటీన్ నిర్వహణకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యాశాఖ కళాశాల కమీషనర్ వారి కార్యాలయం నిర్దేశించిన నియమ నిబంధనల మేరకు ఐదు సంవత్సరాలు వరకు క్యాంటీన్ నిర్వహించవలసి ఉంటుందని, ప్రతి సంవత్సరము పనితీరు ఆధారంగా ఐదు సంవత్సరముల వరకు క్యాంటీన్ నిర్వహణకు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాలకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డిని 9966695666 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా రాద్ధాంతం చేయడం విచారకరమన్నారు. మునగపాక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే వలంటీర్ వల్లనే సాధ్యమవుతుందన్నారు. తమకు కేటాయించిన 50 ఇళ్లకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు కీలకంగా మారుతున్నారన్నారు. గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే వలంటీర్ వ్యవస్థ బలంగా ఉండడమే కారణమన్నారు. ప్రభుత్వానికి రోజురోజుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు, ప్రతిపక్ష నేతలు విమర్శలు చేయడం తగదన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నేతలు మళ్ల సంజీవరావు, దొడ్డి వరహా సత్యనారాయణ, దాసరి అప్పారావు, దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, ,దుబాసి నాయుడు, నరాలశెట్టి సూర్యనారాయణ, గుంట్ల అప్పారావు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

యలమంచిలి : రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని పరవాడ డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం యలమంచిలి పట్టణం గుర్రప్ప కళ్యాణ మండపంలో డ్రైవర్లు, మహిళా పోలీసులు, మున్సిపల్ అధికారులుకు రోడ్డు భద్రత నియమాలపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై నిబద్ధత కలిగి ఉండాలని అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలపై ప్రయాణించేటప్పుడు అతివేగంగా వెళ్ళరాదని, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని, వాహనాలకు రికార్డులు లేకుండా నడపవద్దని, మితిమిరిన వేగంతో వెళ్లి ప్రాణాలను కోల్పోవద్దని, ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనాలపై ప్రయాణించేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపవద్దని, యలమంచిలి హైవేపై వాహనాలను నిషేధిత స్థలాల్లో నిలపరాదని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాలపై పట్టణంలో అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీని డీఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించారు.

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలి

కోటవురట్ల: సనాతన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ సూచించారు. జల్లూరు గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ధనుర్మాసంలో మేలుకొలుపు కార్యక్రమాల ద్వారా వచ్చిన విరాళాలతో అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం శ్రీరామ భజన బృందం సభ్యులు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పాటించడం ద్వారా కుటుంబ వ్యవస్థ పటిష్టమవుతుందన్నారు.

ప్రజలు ఛీకొట్టినా పవన్‌కు బుద్ధి రాలేదు



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : రెండు చోట్ల పోటీ చేసి ఒక్క చోట కూడా గెలవలేని పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి పదవి కోసం ఆరాట పడడం సిగ్గుచేటని పాయకరావుపేట ఎమ్మెల్యే, అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు ఆక్షేపించారు. శనివారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ సినిమాలకే తప్ప రాజకీయాలకు పనికిరాడన్నారు. అందుకే ప్రజలు పవన్ కల్యాణ్ పోటీ చేసిన భీమవరం, గాజువాకలలో ఓడించారన్నారు. అయినా పవన్‌కల్యాణ్‌కు సిగ్గులేదన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత పవన్ కల్యాణ్‌కు లేదన్నారు. జెండా తప్ప అజెండా లేని జనసేన అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. పవన్‌కు దమ్ముంటే ప్రజాసమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఒంటరిగా పోటీ చేయాలన్నారు. చంద్రబాబుకు పదవీ వ్యామోహం తప్ప ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. తన ప్రచారం కోసం సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నారన్నారు. విచక్షణా జ్ఞానం కోల్పోయిన చంద్రబాబును ప్రజలు ఎప్పుడో దూరం పెట్టారని అన్నారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తూ, ప్రతి ఇంటికి ఈ మూడేళ్లలో లక్ష నుంచి రూ.2 లక్షల మేర లబ్ధి చేకూర్చి రూ.1.40 లక్షల కోట్లను నేరుగా వివిధ పథకాల రూపంలో ప్రజల ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, జెడ్పీటీసీ సభ్యుడు లంకసూరిబాబు పాల్గొన్నారు.